అక్రమ కట్టడాల కూల్చివేతల ఫోటోలు మీడియాకు ఎలా వెళ్తున్నాయి..? ఎవరు సమాచారం ఇస్తున్నారు..? అంటూ చైన్‌మెన్‌లకు "లక్ష్మణ రేఖ" గీస్తున్న దుండిగల్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సంజునా..

అక్రమ నిర్మాణాల నియంత్రణలో దృష్టి సారిస్తే బాగుండేది.. కూల్చివేతల ఫోటోలు- వివరాలు గోప్యంగా ఉంచాలని చైన్‌మెన్‌లకు బోధించడంలో ఆంతర్యం..? ఒక బాధ్యతగల టౌన్‌ప్లానింగ్ అధికారిగా అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోకపోవడమే కాకుండా..! స్థానికుల ఫిర్యాదులు, పత్రికల్లో వరుస కథనాలు, వచ్చినా..! టిపిఎస్ సంజునా, టిజి-బిపాస్ చట్టాన్ని ఉల్లంఘించి, ప్రమాదకర అక్రమ నిర్మాణాలు ప్రోత్సహించడం దురదృష్టకరం.. మరోవైపు మున్సిపల్ కమిషనర్ కూడా ఈ విషయాన్ని పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.. ఈ అక్రమ కట్టడాల వ్యవహారం "కమిషనర్-టిపిఎస్" ఇద్దరి కనుసన్నల్లోనే జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నప్పటికీ..! మరోవైపు శంభీపూర్ గ్రామంలోని "వర్టెక్స్ కంపెనీ" అక్రమ భారీ షెడ్డుపై చర్యల విషయంలో మాత్రం సయోధ్య కుదరడం లేదని స్పష్టమవుతుంది.. వర్టెక్స్ షెడ్డును ఒకరు కూల్చేయమని, మరొకరు వద్దని వాదనలు జరిగాయని సమాచారం.. ఎట్టకేలకు సోమవారం ఫోటోషూట్ కూల్చివేతలు, పై అధికారుల నివేదికల కోసమేనని సర్వత్రా ఆరోపణలు ఉన్నాయి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, నవంబర్ 25:


# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

బుధవారం | 26 నవంబర్ 2025 | పేజీలు 8





వర్టెక్స్ కంపెనీ అక్రమ షెడ్డుపై "పెన్ పవర్" వార్తా కథనం..

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

# 'వర్టెక్స్' అక్రమ షెడ్డుపై..!

# "ఫోటోషూట్" కూల్చివేతలు

### ఈ ఇష్టంలేని చర్యలు ఎవరి మెప్పు పొందడానికి "టిపిఎస్" సంజునా మేడమ్..?



అక్రమ షెడ్డును ఇలా కూల్చివేత ప్రారంభించి..

- శంభీపూర్‌లో టిజి-బిపాస్ చట్టాన్ని ఉల్లంఘించి వర్టెక్స్ షెడ్డు నిర్మాణం..
- చర్యలకు ఆకుల సతీష్ డిమాండ్..! పలుమార్లు ఫిర్యాదు..!
- "ఒకరు కూల్చేయాలని- మరొకరు వద్దని" ఎట్టకేలకు "ఫోటోషూట్" చర్యలు..
- దుండిగల్ మున్సిపాలిటీలో అధికారుల విధుల్లో కరువైన పారదర్శకత..
- అక్రమ షెడ్లు- అక్రమ నిర్మాణాల కోసమే టౌన్‌ప్లానింగ్ అధికారి విధులు..!

-2లో

# శాసనసభలో నేనే సీనియర్..

### కేసీఆర్ నా కంటే సీనియర్ కానీ సభకు రావడం లేదు



- అసెంబ్లీకి వచ్చే వాళ్లలో మాత్రం తాను సీనియర్ నాయకుడినన్న మంత్రి
- ఏడుసార్లు ఒకే బీఫామ్‌పై గెలిచానన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
- పునర్విభజన జరిగితే ప్రతి పార్లమెంటులో రెండు అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయన్న మంత్రి

-2లో

# కూలిన బేస్‌మెంట్.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమకు తప్పిన ప్రమాదం

- గృహ నిర్మాణ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్ల సందర్శనకు వెళ్లిన ఎమ్మెల్యే
- డబుల్ బెడ్రూం ఇళ్లను తనిఖీ చేస్తుండగా కూలిన బేస్‌మెంట్
- కిందపడిపోకుండా పట్టుకున్న అధికారులు, సహాయకులు

హైదరాబాద్ పెన్ పవర్:ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, ఇతర అధికారులకు పెను ప్రమాదం తృటిలో తప్పింది. వేములవాడలో గృహ నిర్మాణ పథకం కింద


-2లో



# ‘వర్టెక్స్’ అక్రమ షెడ్డుపై..! “ఫోటోషూట్” కూల్చివేతలు..



అక్రమ షెడ్డుపై ఇలా ఫోటోషూట్ చర్యలతో మమః..




**తెలంగాణ మున్సిపల్ చట్టం - 2019కి విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు వెలుస్తుంటే..! నిర్లక్ష్యం వహిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు.. ఫిర్యాదులు వచ్చినా..! నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం విశేషం.. పైగా అక్రమ షెడ్డును కూల్చేస్తే, “వర్టెక్స్ కంపెనీకి” భారీగా నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్టు టౌన్‌ప్లానింగ్ అధికారి సంజునా భావించారో ఏమోకానీ..! టిపిఎస్ సంజునా ఉదాసీనతతో వ్యవహరించి మొక్కుబడి కూల్చివేతలు చేపట్టినట్టు తెలుస్తోంది.. దుండిగల్ మున్సిపాలిటీ అక్రమ కట్టడాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని ఈ వర్టెక్స్ కంపెనీ షెడ్డుపై, పాక్షిక కూల్చివేతలే నిదర్శనం.. మరోవైపు మేడ్చల్ జిల్లా లోకల్‌బాడీ అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా పట్టించుకోకపోవడం అనుమానాలను రేకెత్తిస్తుంది..**

- మొదటి పేజి తరువాయి

దుండిగల్ మున్సిపల్ పరిధిలోని శంబిపూర్ గ్రామంలోని “వర్టెక్స్ నిర్మాణ సంస్థ” నిర్మించిన అక్రమ షెడ్డుపై మున్సిపల్ కూల్చివేతలు హాస్యాస్పదంగా ఉన్నాయి.. సర్వే నెంబర్ 30లో, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, నిర్మించిన అక్రమ షెడ్డుపై మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారి అంతగా ఉదాసీనతతో వ్యవహరించడం వెనుక ముడుపులే కారణమా..? ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోకుండా, చివరికి మొక్కుబడి చర్యలతో మమః అనిపించి “ఫోటోషూట్” కూల్చివేతలు ఎవరి మెప్పు కోసం..? బడా నిర్మాణ సంస్థల అక్రమ కట్టడాలకు అధికారులే రక్షణ వలయంగా మారుతున్నారా..? దుండిగల్ మున్సిపల్ పరిధి శంభీపూర్ గ్రామ పరిధి సర్వే నెం.30లో ఉన్నదే 00-32 గుంటల వ్యవసాయ భూమిలో నాలా కన్వర్షన్ కూడా లేకుండానే..! “వర్టెక్స్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ” భారీ అక్రమ షెడ్డును నిర్మించిందని,
ఈ నిర్మాణానికి సంబంధించి మున్సిపల్, హెచ్.ఎం.డి.ఏ అనుమతి ఇవ్వలేదని ఆయన ఆరోపించారు.. అనుమతులు లేకుండా నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ, మున్సిపల్ అధికారులు మౌనంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది..
పలుమార్లు మున్సిపాలిటీలో ఫిర్యాదు చేసినప్పటికీ, ట్విట్టర్(ఎక్స్)లోనూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి..

## కూల్చివేతల ఫోటోలు మీడియాకు ఇవ్వొద్దట..!

ఏదిఏమైనప్పటికీ దుండిగల్ మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ అధికారి నియంతృత్వ విధానాలతో విధులు నిర్వర్తిస్తూ, టౌన్‌ప్లానింగ్ సెక్షన్ సిబ్బందిని కూడా, తప్పుదోవ పట్టిస్తున్నారని స్థానిక చైన్‌మెన్ సమాధానం తేటతెల్లం చేస్తోంది.. శంభీపూర్ గ్రామంలోని “వర్టెక్స్ కంపెనీకి” చెందిన అక్రమ షెడ్డుపై చర్యలకు ఒత్తిడి మరింత పెరగడంతో..! సోమవారం దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అధికారి టిపిఎస్ సంజునా ఆదేశాలతో కూల్చివేతలకు వెళ్ళిన సిబ్బంది, మేడమ్ సూచనలతో “ఫోటోషూట్”(పాక్షిక) చర్యలతో వెనుదిరిగారు.. నివేదికల కోసమే అన్నట్టు, రెండు ఫోటోలు తీసుకుని వెనుదిరిగారు.. ఈ కూల్చివేతల విషయం బయటకు రాకుండా చైన్‌మెన్‌లకు వార్నింగ్ ఇచ్చినట్టు స్పష్టమవుతుంది.. స్థానిక చైన్‌మెన్‌ను కూల్చివేతల ఫోటోలు ఇవ్వమని పలుమార్లు అడిగినా ఇవ్వలేదు, పైగా టిపిఎస్ సంజునా మేడమ్‌ను అడగమని స్థానిక చైన్‌మెన్ పెన్ పవర్ ప్రతినిధికి ఉచిత సలహా ఇచ్చాడంటేనే, టిపిఎస్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది నిజమేనని స్పష్టమవుతుంది..

# శాసనసభలో నేనే సీనియర్.. కేసీఆర్ నా కంటే సీనియర్ కానీ సభకు రావడం లేదు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత శాసనసభలో తానే సీనియర్ అని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కేసీఆర్ తనకంటే సీనియర్ అయినప్పటికీ సభకు రావడం లేదని ఆయన అన్నారు. ప్రస్తుతం అసెంబ్లీకి వచ్చే వారిలో మాత్రం తాను సీనియర్ నాయకుడినని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయమై ఆయన మీడియాతో పిచ్చాపాటిగా మా ట్లాడారు. ఏడుసార్లు ఒకే పార్టీ బీఫామ్‌పై గెలిచిన వ్యక్తిని తానే అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలులోకి వచ్చే అవకాశం ఉందని ఆయన అభిప్రాయప డ్డారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి రెండు అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని ఆయన అన్నారు.

# కూలిన బేస్‌మెంట్.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమకు తప్పిన ప్రమాదం

- మొదటి పేజి తరువాయి

నిర్మిస్తున్న ఇళ్లను సందర్శించడానికి వారు వెళ్లారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను తనిఖీ చేస్తుండగా బేస్‌మెంట్ కూలిపోయింది. సహాయకులు, అధికారులు వెంటనే స్పందించి ఎమ్మెల్యే కింద పడకుండా పట్టుకున్నారు. ఈ ఘటనపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి ఈ బేస్‌మెంట్ కూలడమే నిదర్శనమని బీఆర్ఎస్ ఆరోపించింది. బీఆర్ఎస్ విమర్శలపై ఆది శ్రీనివాస్ సైతం స్పందించారు. బీఆర్ఎస్ హయాంలో ఆమోదించబడిన కాంట్రాక్టర్లు ఈ ఇంటిని నిర్మించారని ఆది శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో అన్నీ నాసిరకం పనులే జరిగాయనడానికి ఇదే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. బేస్‌మెంట్ మీద నిలబడిన వెంటనే అది కూలిపోయిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో అడ్డదారిలో డబ్బులు దోచుకోవడానికి, కమీషన్లు పొందడానికి నాణ్యత లేని పనులు చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే ఈ బేస్‌మెంట్ నిర్మాణం చేపట్టారని అన్నారు. ఆ నిర్మాణాన్ని కూడా మధ్యలోనే వదిలేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని నిర్ణయించామని, అందులో భాగంగానే కలెక్టర్, అధికారులతో కలిసి తాను తనిఖీలకు వెళ్లానని ఆది శ్రీనివాస్ తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీలు కూడా కూలిపోయాయని ఆరోపించారు. తమ ప్రభుత్వం వీలైనంత త్వరగా ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తుందని హామీ ఇచ్చారు.

# బాలకృష్ణ సినిమా వేడుకకు చీఫ్ గెస్ట్ గా సీఎం రేవంత్ రెడ్డి!

- 'అఖండ 2' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్
- ఈ నెల 28న ఘనంగా జరగనున్న వేడుక
- షూటింగ్ బిజీ వల్ల రాలేకపోతున్న అల్లు అర్జున్
- డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల
- డిసెంబర్ 4న ప్రీమియర్ షోలకు ప్లాన్ చేస్తున్న నిర్మాతలు





**హైదరాబాద్ పెన్ పవర్:**నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'అఖండ 2'. డిసెంబర్ 5న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 28న నిర్వహించనున్న ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది.

ఈ వేడుకను చాలా గ్రాండ్‌గా నిర్వహించేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను కూడా మరో అతిథిగా ఆహ్వానించినట్లు సమాచారం. అయితే, ప్రస్తుతం ఆయన అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటంతో ఈవెంట్‌కు రాలేకపోతున్నారని తెలిసింది. సినిమా విడుదలయ్యాక జరిగే సక్సెస్ మీట్‌లో బన్నీ పాల్గొనే అవకాశం ఉందని అంటున్నారు. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, 'జాజికాయ జాజికాయ' పాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు, డిసెంబర్ 4వ తేదీ రాత్రి నుంచే పెయిడ్ ప్రీమియర్ షోలు ప్రదర్శించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన అనుమతుల కోసం చిత్ర బృందం ఎదురుచూస్తోంది.

# కాంగ్రెస్‌కు ఓటేసి నన్నెందుకు అడుగుతావ్?: నెటిజన్‌కు కేటీఆర్ సమాధానం

- ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపుపై నెటిజన్ ఆవేదన
- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీయాలంటూ కేటీఆర్‌కు విజ్ఞప్తి
- కాంగ్రెస్‌కు ఓటేశానని చెప్పడంతో కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు
- కాంగ్రెస్ పార్టీనే అడగాలి కదా అని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో పెరిగిన ఆర్టీసీ బస్సు ఛార్జీలపై ఓ నెటిజన్ చేసిన పోస్టుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆసక్తికరంగా స్పందించారు. "అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటు వేశాను, కానీ మీరు ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించాలి" అని కోరిన నెటిజన్‌కు.. "మీరు ఓటు వేసింది కాంగ్రెస్ పార్టీకి అయినప్పుడు, ఈ ప్రశ్నకు సమాధానం కూడా వాళ్లనే అడగాలి కదా?" అంటూ కేటీఆర్ బదులిచ్చారు. పటాన్‌చెరు నుంచి డీఎల్ఎఫ్ వరకు నడిచే మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు ఛార్జీని రూ. 30 నుంచి రూ. 45కు పెంచారని, ఇది తమ లాంటి రోజువారీ ప్రయాణికులకు భారంగా మారిందని ఓ నెటిజన్ ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి, ప్రభుత్వ తీరును నిలదీయాలని కేటీఆర్‌ను ట్యాగ్ చేస్తూ కోరాడు. తాను అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు ఓటు వేశానని, కానీ ఇంత భారీగా ఛార్జీలు పెంచడం సరికాదని ఆ పోస్టులో పేర్కొన్నాడు. ఈ పోస్టుపై స్పందించిన కేటీఆర్, "మీరు చెప్పినట్టు నిజంగా కాంగ్రెస్‌కే ఓటేసి ఉంటే, ఈ ప్రశ్నకు సమాధానం కూడా కాంగ్రెస్ పార్టీనే అడగాలి కదా?" అని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ, ప్రజా సమస్య కాబట్టి బస్సు ఛార్జీల పెంపుపై తాము తప్పకుండా గళం విప్పుతామని హామీ ఇచ్చారు.

గత అక్టోబర్‌లో టీజీఎస్ఆర్టీసీ బస్సు ఛార్జీలను పెంచిన విషయం తెలిసిందే. కాగా, కేటీఆర్ పోస్టుపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. కొందరు నెటిజన్లు ఛార్జీల పెంపును విమర్శిస్తుండగా, మరికొందరు కాంగ్రెస్‌కు ఓటు వేసి బీఆర్ఎస్‌ను ప్రశ్నించడం ఏంటని కామెంట్లు చేస్తున్నారు.

# సీనియర్ సిటిజెన్స్ ఆధ్వర్యంలో స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం.



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో "అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం ను నిర్వహించారు.. మంగళవారం ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్స్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశం లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయవాది హరి అశోక్ కుమార్ మాట్లాడు తూ ఆధునిక సమాజం లో మహిళలపై గృహ హింస,స్త్రీ లపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు నానాటికి అధికమవుతున్నాయని వీటన్నిటిని అరికట్టే ప్రయత్నం లో 1999 డిసెంబర్ 17న ఐక్య రాజ్య సమితి ఒక తీర్మానం చేసి, ప్రతి ఏటా నవంబర్ 25 న స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం పాటించాలని తీర్మానం చేసిందన్నారు. 2030 నాటికీ మహిళలపై అన్ని రకాల హింసలను నిర్మోలించలనే లక్ష్యం ను సాధించాలని సభ్య దేశాలకు ఐక్య రాజ్య సమితి పిలుపు నిచ్చిందని పేర్కొన్నారు గృహ హింస, లైంగిక వేధింపుల నివారణ, నిషేధ పరిష్కార చట్టం తో పాటు వివిధ మహిళా చట్టాలపై సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు, న్యాయ వాది హరి అశోక్ కుమార్ అవగాహన కల్పించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న 16 మంది మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాతం, ఉపాధ్యక్షులు పి. సీ. హన్మంత్ రెడ్డి, పూసాల అశోక్ రావు,కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, ఎం. డి. యాకూబ్, సీనియర్ సిటిజెన్స్ మహిళా కార్యదర్శి బొబ్బాటి కరుణ,మహిళా జేఏ సి జిల్లా అధ్యక్షురాలు కస్తూరి శ్రీ మంజరి, బిసీ మహిళా జిల్లా అధ్యక్షురాలు గంగ%శీ% జలజ, జగిత్యాల పట్టణ అధ్యక్షురాలు సింగం పద్మ, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు బక్క శెట్టి లక్ష్మి, కరుణ, రాధ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసమే చీరలు,రుణాలు పంపిణీ...

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్.**

**హైదరాబాద్ పెన్ పవర్::**స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ లబ్ధి పొందేందుకే ఇందిరమ్మ చీరలు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తున్నారని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన గత రెండు సంవత్సరాల నుండి తెలంగాణ మహిళలకు చీరలు గానీ మహిళా సంఘాలకు రుణాలు గాని ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. నేడో రేపో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం చీరల పంపిణీ రుణాల పంపిణీ అంటూ నాటకాలు ఆడుతుందని అన్నారు. అధికారంలోకి రావడానికి ముందు మహిళలకు ఇచ్చిన హామీలు 500 రూపాయలకు సిలిండర్ నెలకు 2500 రూపాయలు నగదు జమ స్కూటీలు పంపిణీ హామీలు నెరవేర్చలేదని దసరా పండుగకి తెలంగాణ మహిళలకు చీరలు పంపిణీ చేయకుండా ఎన్నికల ముందు పంపిణీ చేస్తున్నారని అన్నారు. రెండు సంవత్సరాల నుండి తెలంగాణలోని క్రైస్తవులకు క్రిస్మస్ పండుగ సందర్భంగా ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా కానుకలు ఇచ్చినప్పుడు హిందువులకు ఎందుకు ఇవ్వలేదని హిందువులు ఏం పాపం చేశారని అన్నారు. తమది సెక్యులర్ ప్రభుత్వం, సెక్యులర్ పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక వర్గం వారికి కానుకలు ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడం సెక్యులరిజం అంటే ఇదేనా అని ప్రశ్నించారు.

# రామగుండం లో రాక్షస పాలన రాజ్యమెలుతుంది

**హైదరాబాద్ పెన్ పవర్:**రామగుండం లో రాక్షస పాలన రాజ్యమెలుతుంది... ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఒక నియంతలగా పరిపాలన చేస్తున్నాడు... మైసమ్మ గుళ్లను కుల్చిన వారిని కఠినంగా శిక్షించాలని, సింగరేణి నిర్మానం చేస్తున్న నూతన వ్యాపార సముదాయంలో కుల్చవేతలకు గురైనా చిరువ్యాపారులకు ఉచితంగా దుకణాలు ఇవ్వాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే బీ.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు.సింగరేణి నిర్మాణం చేస్తున్న నూతన వ్యాపార సముదాయాలు కుల్చివేత గురైన చిరువ్యాపారులకు ఉచితంగాఅందించాలని, అదే విధంగా దారి మైసమ్మ గుడులను కుల్చిన వారిపై కేసులు నమ్మెదు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే బీ.అర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో ఛలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చెపట్టారు. స్దానిక కళ్యాన్ నగర్ చౌరస్త నుండి బీ.ఆర్.ఎస్ శ్రేణులతో ర్యాలి గా బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే చందర్ ని బీ.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులను పోలీసులు అరెస్టు చేసి జైపూర్ పోలీసు స్టేషన్ కు తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

గత రెండు సంవత్సరాలుగా పారిశ్రామిక ప్రాంతంలో చిరు వ్యాపారుల కుల్చివేతల పర్వం సాగుతుందన్నారు. ఎమ్మెల్యే నియంతగా వ్యవహరిస్తూ పూర్వ వైభవం పేరిట చిరువ్యాపారుల జీవితాలను రోడ్డు పై పడివేశారన్నారు.

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 46 మైసమ్మ గుడ్లను ఎవరు కూల్చారు... ఖచ్చితమైన ప్రకటన చేయాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యే పై ఉందని మైసమ్మ గుడులను కుల్చిన వారికి కఠినంగా శిక్షించాలన్నారు. ప్రజల ఆత్మగౌరవం దెబ్బతీసేలా ప్రవర్తించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్థానిక చౌరస్తా, గాంధీ నగర్ ఎన్టీసీసీ ఏరియాలో చిరు వ్యాపారుల దుకాణాలను కూల్చివేసి వారి కుటుంబాలను రోడ్డున పడెశారన్నారు. జీవితాలు సింగరేణి ఆధ్వర్యంలో నిర్మాణం చేస్తున్న దుకాణాలు చిరు వ్యాపారులకు ఉచితంగా అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ప్రజ పాలన కాదు పోలీసు పాలన నడుస్తోందని శాంతియుతంగా బీ.ఆర్.ఎస్ పార్టీ చేపట్టిన ఛలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కార్యక్రమాన్ని దౌర్జన్యంగా బీ.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులను అరెస్టు చేయడం దారుణం అన్నారు.రామగుండం లో నడుస్తున్న బుల్డోజర్ పాలనకు ప్రజలు చరమగీతం పడే రోజులు దగ్గరలో ఉన్నాయని చిరు వ్యాపారులకు అండగా మైసమ్మ గుడులను కుల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు బీ.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బోడ్డు రవీందర్ బాదె అంజలి చెలకలపల్లి శ్రీనివాస్ మేడి సదానందం నారాయణదాసు మారుతి నూతి తిరుపతి మేతుకు దేవరాజ్ దొమ్మేటి వాసు బుర్రి వెంకటేష్ సట్టు శ్రీనివాస్ నీరటీ శ్రీనివాస్ జిట్టవేన ప్రశాంత్ కుమార్ కిరన్ జీ ఆవునూరి వెంకటేష్ముద్దసాని సంధ్యా రెడ్డి లక్ష్మి రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# నవజాత శిశువుల సంరక్షణపై సంకల్ప్ శిక్షణ తరగతులు




**హైదరాబాద్ పెన్ పవర్:**మంగళవారం జిల్లాలోని ఆరోగ్య కార్యకర్తలకు ,ఆశా కార్యకర్తలకు స్థానిక గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో మాతా శిశు సంరక్షణ, నవజాత శిశువుల సంరక్షణపై సంకల్ప్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిల్లా వైద్య అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జనరల్ హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ ఎంజీ కృష్ణమూర్తి, గైనకాలజిస్ట్ హెచ్ ఓ డి డాక్టర్ అరుణ కుమారి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాయి కిరణ్ పాల్గొని శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాష్ట్రంలో శిశు మరణాల రేటు వెయ్యి సజీవ జననాలకు 24 గా ఉందని దీనిని 10 లోపు తీసుకురావడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాతృ సంరక్షణ చర్యల్లో భాగంగా స్త్రీలకు కౌమార దశ నుండి వారి యొక్క ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తద్వారా వారి వైవాహిక జీవితం అలాగే గర్భధారణ సమయంలో, ప్రసూతి సమయంలో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రజలలో ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు విస్తృతమైన అవగాహన ద్వారా వారి యొక్క ఆరోగ్యం పట్ల తీసుకునే ఆహారపు అలవాట్ల పట్ల మెలకువలు నేర్పించాలని సూచించారు. గర్భధారణ జరిగిన 12 వారాలలోపు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసి దనుర్వాతాన్ని రాకుండా నెల విరామంతో టెటనస్ డిఫ్తీరియా వన్ అండ్ టూ డోసులు ఇప్పించాలని తెలిపారు. రక్తహీనతను నివారించడానికి ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను ఇప్పించాలని, ఆకుకూరలు కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని,క్రమం తప్పకుండా వైద్యాధికారులచే నిశితంగా పరీక్షింప చేయాలని సూచించారు. బర్త్ ప్లా న్ ముందుగా ప్రిపేర్ చేసుకున్నట్లుగా అన్ని సదుపాయాలు ఉన్న మాతా శిశు సంరక్షణ లాంటి కేంద్రాల్లోనే డెలివరీ అయ్యేవిధంగా తోడ్పాటు అందించాలని తెలిపారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి శిక్షణ అందించారు. డెలివరీ అయిన తర్వాత నవజాత శిశువుల సంరక్షణ గురించి , తల్లి బిడ్డకు పాలు పట్టే విధానాల గురించి, కంగారు పిల్లలను సంరక్షించే విధానం గురించి (తల్లి శరీరానికి బిడ్డ శరీరం అతుక్కొని ఉండే విధంగా) విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏ శ్రీనివాస్ ,మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి , డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ స్వరూప గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాయి కిరణ్, ఎన్ హెచ్ ఎం డిపిఓ రవీందర్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# రేపటి తరాన్ని డ్రగ్స్ మహమ్మారి నుంచి రక్షిద్దాం

**హైదరాబాద్ పెన్ పవర్:**గొల్లపల్లి మండలం మల్లన్నపేటలో ప్రతివ సంవత్సరం నిర్వహించే జాతర మంగళవారం నుండి ప్రారంభమైంది. ఈ జాతరలో జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. సుమారు నెలరోజుల పాటు కొనసాగనున్న ఈ జాతరను దృష్టిలో ఉంచుకొని, జగిత్యాల జిల్లా పోలీసులు సమగ్ర భద్రత మరియు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు.జాతర ప్రాంతానికి భారీగా చేరుకునే భక్తులలో మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయం మరియు రవాణాపై అవగాహన పెంచడానికి, జిల్లా పోలీసులు ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందుకుగాను, జాతర ప్రాంతానికి చేరుకునే ఆటో రిక్షాలపై “మాదక ద్రవ్యాల నిర్మూలను మనందరి బాధ్యత” అనే సందేశంతో ప్రత్యేక ప్రచార పోస్టర్లు అంటించి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... మాదకద్రవ్యాల రహిత జిల్లాగా జగిత్యాలను మార్చాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆలోచన మేరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని డిఎస్పీ తెలిపారు.జిల్లాలో నిషేధిత మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి పౌరుడు సహకరించాలని, ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి, మల్యాల సీ.ఐలు రాంనర్సింహారెడ్డి, రవి, ఎస్సైలు కృష్ణసాగర్ రెడ్డి, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు

# డ్యూటీలో దీక్షలా...

## పోలీసు శాఖ కఠిన ఆంక్షలు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ పోలీసు శాఖ తమ సిబ్బంది మతపరమైన దీక్షలు చేపట్టడంపై కీలక, కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. అయ్యప్ప దీక్ష వంటి మతపరమైన దీక్షల్లో ఉన్నవారు విధి నిర్వహణకు హాజరుకాకూడదని, తప్పనిసరిగా సెలవు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను ఉల్లంఘించి డ్యూటీలో దీక్షా వస్త్రాలతో కనిపించినందుకు సౌత్ ఈస్ట్ జోన్‌కు చెందిన కంచన్‌బాగ్ ఎస్సై కృష్ణకాంత్‌కు ఉన్నతాధికారులు మెమో జారీ చేశారు.ప్రస్తుతం అయ్యప్ప దీక్షల సీజన్ కావడంతో కానిస్టేబుళ్ల నుంచి ఉన్నతాధికారుల వరకు చాలామంది సిబ్బంది మాల ధరించారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ ఈ కొత్త మార్గదర్శకాలను విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు యూనిఫామ్ లేకుండా నల్ల దుస్తులు, నల్ల కండువాలు ధరించడం, షూస్ లేకుండా తిరగడం వంటివి చేయరాదని హెడ్ ఆఫీస్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అలాగే, పోలీసులు విధుల్లో ఉన్నప్పుడు జుట్టు, గడ్డం పెంచుకోవద్దని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది.అయితే, మతపరమైన దీక్షలను శాఖ వ్యతిరేకించడం లేదని, క్రమశిక్షణకే ప్రాధాన్యత ఇస్తున్నామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. దీక్ష చేపట్టాలనుకునే వారు ముందస్తుగా అనుమతి తీసుకుంటే రెండు నెలల వరకు సెలవులు మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. దీక్షలో ఉంటూ విధులకు హాజరుకావడం మాత్రం నిబంధనలకు విరుద్ధమని తేల్చిచెప్పారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్ పెన్ పవర్::తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా అడుగులు వేస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.జగిత్యాల కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం ప్రారంభానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.జగిత్యాల జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ మరియు సెర్ప్ ఆద్వర్యంలో జగిత్యాల నియోజకవర్గంలో 2434 స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 2 కోట్ల 12 లక్షలు వడ్డీ లేని రుణాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని చెక్కును పంపిణీ చేశారు.ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూస్వాతంత్ర్యం కు ముందు, స్వాతంత్ర్యం తర్వాత ఇందిరమ్మ కుటుంబం చేసిన త్యాగం, పాలన విధానం వెల కట్టలేనిది అని అన్నారు.దేశంలో తొలి మహిళ ప్రధానిగా, ఉక్కు మహిళగా ఇందిరమ్మ ఖ్యాతి గడించిందన్నారు.ఇందిరమ్మ పాలనలో గరిబీ హఠావో, బ్యాంకుల జాతీయీకరణ లాంటి ప్రజా ఉపయోగ విధానాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశ అభివృద్ధికి బాటలు వేశారన్నారు.మహిళాభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని వివరించారు.స్థానిక ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ముందుకు వచ్చిందని, ఎన్నికల తర్వాత గ్రామాల అభివృద్ధి కి నిధుల వరద ప్రారంభం అవుతుందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం రు. 5 లక్షలు అందిస్తుందన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని, అధికారులు బిల్లులు తొందరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక, సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుండే రాష్ట్రంలో పండగ వాతావరణం ఏర్పడిందన్నారు. అప్పటి నుండి మొదలు నేడు ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ తో పండగ కళ రెట్టింపు అయ్యిందని తెలిపారు.

# కాంగ్రెస్ అభ్యర్థిని ఏకగ్రీవం చేస్తే రూ.25 లక్షలు: ఎమ్మెల్యే కడియం సంచలన హామీ



**హైదరాబాద్ పెన్ పవర్:**స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాభివృద్ధి కోసం ఆయన ప్రకటించిన భారీ ఆఫర్లు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

**కడియం శ్రీహరి ఇచ్చిన హామీ ఏమిటి?**

ఒక సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి తమ పార్టీ అభ్యర్థుల విజయం కోసం కీలక ప్రకటన చేశారు. సర్పంచ్ పదవికి కాంగ్రెస్ అభ్యర్థిని ప్రతిపాదిస్తే గ్రామానికి రూ. 10 లక్షలు ఇస్తానని ప్రకటించారు. సర్పంచ్ అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఆ గ్రామాభివృద్ధి కోసం ఏకంగా రూ. 25 లక్షలు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నిధులు ప్రభుత్వంతో సంబంధం లేకుండా తన ఎంపీ లేదా ఎమ్మెల్యే నిధుల నుంచే ఇస్తానని ఆయన స్పష్టం చేశారు.

**జూబ్లీహిల్స్ ఎన్నికల ఉదాహరణ**

ఇటీవలి ఎన్నికల ఫలితాలను గుర్తుచేస్తూ కడియం శ్రీహరి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం అని పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ.. ప్రజలు కాంగ్రెస్‌కే అధికారం కట్టబెట్టారని అన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

**రాజకీయాల్లో కొత్త చర్చ**

ఎన్నికల సమయంలో అభ్యర్థులను ఏకగ్రీవం చేసేందుకు ఈ రకమైన నిధుల హామీలు ఇవ్వడంపై రాజకీయంగా భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది పరిశీలకులు దీనిని గ్రామాభివృద్ధికి సానుకూలంగా భావిస్తున్నారు. ఏకగ్రీవం ద్వారా ఎన్నికల ఖర్చు తగ్గుతుందని, ఆ డబ్బు నేరుగా అభివృద్ధికి ఉపయోగపడుతుందని అంటున్నారు. మరికొందరు ఈ విధానం ఎన్నికల స్వేచ్ఛకు భంగం కలిగించవచ్చని, ఇది ఒక రకమైన ప్రలోభంగా మారుతుందని విమర్శిస్తున్నారు.

**గ్రామస్థాయిలో ప్రభావం**

కడియం శ్రీహరి ఇచ్చిన ఈ ఆఫర్లు గ్రామస్థాయిలో కాంగ్రెస్ పటిష్టతను పెంచే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అయితే, ప్రత్యర్థి పార్టీలు దీనిపై ఎలాంటి వ్యూహాన్ని అనుసరిస్తాయో, గ్రామస్థాయిలో ఈ హామీలు ఎంతవరకు ప్రభావం చూపుతాయో చూడాలి.

# గ్రేటర్ హైదరాబాద్ విస్తరణ.... కేబినెట్ కీలక నిర్ణయాలు

హైదరాబాద్ పెన్ పవర్:

తెలంగాణ మంత్రిమండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. 27 మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్‌లో కలిపి విస్తరించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం పెద్దఅంబర్‌పేట్, శంషాబాద్, అమీన్‌పూర్, బండ్లగూడజాగీ, జల్‌పల్లి, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, తుక్కుగూడ, మేడ్చల్, నాగారం, దమ్మాయి గూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, బడంగ్‌పేట్, మీర్‌పేట్, బోడుప్పల్, నిజాంపేట్, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, ఫిర్జాదిగూడ, జవహర్ నగర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు ఓకే చెప్పారు.

హైదరాబాద్ తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా పరిధిలో ఉన్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లన్నీ జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఔటర్ రింగ్ రోడ్ లోపల బయట, ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 27 అర్బన్ లోకల్ బాడీస్ %+నవీజ%లో విలీనం కానున్నాయి. అందుకు అవసరమైన జీహెచ్ఎంసీ యాక్ట్, తెలంగాణ మున్సిపల్ యాక్ట్ లకు సవరణలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇప్పుడున్న %చీూణజూ, ూాణజూౌ% రెండు డిస్కమ్లతోపాటు కొత్తగా మూడో డిస్కమ్ ఏర్పాటు చేసేందుకు ఆమోద ముద్రవేసింది. రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ కనెక్షన్లు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్స్, మిషన్ భగీరథ, సురక్షిత మంచి నీటి పథకాలు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్ సీవరేజ్ బోర్డ్ పవర్ కనెక్షన్లన్నీ కొత్త డిస్కమ్ పరిధిలోకి వస్తాయి. దీంతోపాటు రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్, రాబోయే పదేళ్లకు అవసరమయ్యే విద్యుత్తు సరఫరా, విద్యుత్తు ఉత్పత్తి అంచనాలను చర్చించారు. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 3000 మెగా వాట్ల సోలార్ పవర్ కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని నిర్ణయం



తీసుకుంది. అయిదేళ్లపాటు విద్యుత్ సరఫరా చేసే కాల పరిమితి ఒప్పందాలతో ఈ టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. సోలార్ పవర్ తరహాలోనే పంప్డ్ స్టోరేజ్ పవర్ వినియోగం పెంచాల్సి ఉంది. 2000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. అయిదేళ్ళ కాల పరిమితితోనే ఈ టెండర్లు కూడా పిలవాలని కేబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకు వచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే డిస్కమ్లు వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించాలని నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 10 వేల మెగా వాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లు అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్ ను ముందుగా మన డిస్కమ్‌లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది.

**విద్యుత్ ఉత్పత్తి బాధ్యత ఆయా పరిశ్రమలకే**

రాష్ట్రానికి వచ్చే కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రాష్ట్ర మంత్రివర్గం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. కొత్తగా స్థాపించే పరిశ్రమలు తమకు అవసరమైన విద్యుత్తును తమతంట తామే సొంతంగా ఉత్పత్తి చేసుకునేందుకు అవకాశం కల్పించింది. కొత్త పరిశ్రమలు క్యాప్టివ్ పవర్ జనరేషన్‌కు అప్లై చేసుకుంటే వెంటనే అనుమతి ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యానికి సంబంధిత ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలకు ఇప్పుడున్న విధానంలోనే విద్యుత్ సరఫరా జరుగుతుంది.రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌లో కొత్తగా నిర్మించే 800 మెగావాట్ల ప్లాంట్‌ను ఎన్టీపీసీ అధ్వర్యంలో చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. పాల్వంచ, మక్తల్‌లోనూ ఎన్టీపీసీ అధ్వర్యంలో విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించింది. ఎన్టీపీసీకి ఈ యూనిట్ నిర్మాణం అప్పగిస్తే ఎంత విద్యుత్ యూనిట్ రేట్ పడుతుంది. జెన్ కో ద్వారా చేపడితే ఎంత రేట్ పడుతుందో. ముందుగా అంచనాలు వేసుకొని తుది పరిశీలన చేయాలని కేబినెట్ నిర్ణయించింది.హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బెంగుళూరులో అండర్ గ్రౌండ్ విద్యుత్తు కేబుల్ సిస్టమ్ ఉంది. ఇటీవలే అక్కడ అమలు చేసిన విధానాన్ని అధికారులు అధ్యయనం చేసి వచ్చారు. అక్కడ అమలు చేసిన విధానం ప్రకారం %+నవీజ% పరిధిలో అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టమ్ ఏర్పాటుకు దాదాపు రూ. 14 వేల 725 కోట్ల ఖర్చు అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. హైదరాబాద్ సిటీని విద్యుత్ సర్కిళ్ల వారీగా మూడ

విభాగాలుగా విభజించుకొని.. ఈ ప్రాజెక్ట్ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. విద్యుత్‌తోపాటు టీ ఫైబర్, వివిధ కేబుల్ నెట్వర్క్ వైర్లన్నీ అండర్ గ్రౌండ్‌లోనే ఉండేలా చేయాలని, ఆ కంపెనీలతో సంప్రదింపులు జరపాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించి వర్కింగ్ ప్లాన్ రెడీ చేయాలని అధికారులను ఆదేశించింది. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో కొత్తగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పుడున్న 56 ఏటీసీ లతో పాటు కొత్తగా 6 ఐటీఐలలో ఏటీసీ లను ఏర్పాటు చేయాలని నిర్ణయం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం పెద్ద నల్లబెల్లి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ బీసీ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 20.28 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ములుగు జిల్లా ములుగు మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో స్పోర్ట్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

# తెలంగాణ పంచాయతీ పోరు.. మూడు ప్రధాన పార్టీలు ఎలా ఫీల్ అవుతున్నాయో తెలుసా?

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో పల్లెపోరుకు సర్వం సిద్ధమైంది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లను ప్రకటించడంతో ఏ క్షణమైనా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందంటున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం నవంబరు 26 బుధవారమే షెడ్యూల్ విడుదల కావొచ్చని ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో మూడు విడతలుగా ఎన్నికలు జరిగే చాన్స్ ఉందని అంటున్నారు. డిసెంబరు 11, 15, 19న ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోందని కథనాలు వస్తున్నాయి. అయితే అధికారికంగా తేదీలను ఖరారు చేయాల్సివున్నప్పటికీ, వచ్చే నెలలో రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయని అంటున్నారు. దీంతో ప్రధానపార్టీల్లో హడావుడి మొదలైంది.



గ్రామస్థాయిలో అంత్యంత కీలకమైన పంచాయతీలకు చాలా కాలంగా పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర నిధుల విడుదల నిలిచిపోయింది. దీంతో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్నికలు నిర్వహించి తీరాలని నిర్ణయానికి వచ్చిన ప్రభుత్వం.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై నెలకొన్న వివాదాన్ని సాగ దీయకుండా యథావిధిగా ఎన్నికలు జరిపించాలని నిర్ణయించింది. ఇక ఈ ఎన్నికలు పార్టీ రహితంగా జరిగినా, గ్రామాల్లో పార్టీపరంగానే పోటీ జరిగే అవకాశాలు ఉన్నాయి. పంచాయతీల్లో పట్టు ఉంటేనే రాష్ట్రస్థాయిలో పార్టీలకు బలం పెరుగుతుందని అంటున్నారు. దీంతో గ్రామాల్లో పునాదులు గట్టి చేసుకోవడానికి మూడు పార్టీలు సన్నద్ధమవుతున్నాయి.రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ తోపాటు ప్రతిపక్షాలు బీఆర్ఎస్, బీజేపీ మధ్య త్రిముఖ పోటీ జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉండనుందని అంటున్నారు. ఈ రెండు పార్టీలకు గ్రామస్థాయిలో బలమైన కేడర్ ఉండటంతో చాలాచోట్ల ద్విముఖ పోటీ జరిగే పరిస్థితి కనిపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే బీజేపీ గట్టిపోటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇక ఈ ఎన్నికలతో తమకు ఓ తలనొప్పి తప్పుతుందని కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

రెండేళ్లుగా పంచాయతీ, స్థానిక ఎన్నికలు నిర్వహించకపోవడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలపై తీవ్రస్థాయి ఒత్తిడి పెరిగిపోతోందని చెబుతున్నారు. ఏ చిన్న పని అయినా ప్రజలు నేరుగా ఎమ్మెల్యేలు, ఎంపీలను కలుస్తున్నారు. దీనివల్ల నియోజకవర్గంలో ప్రతి చిన్న విషయాన్ని పట్టించుకోవాల్సి వస్తోంది. ఫలితంగా పనిభారం పెరిగిపోతోందని, సమస్య పరిష్కారంలో జాప్యం జరిగితే అది తమపై వ్యతిరేక ప్రభావం చూపిస్తోందని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎన్నికలు జరిపిస్తే.. తమ బాధ్యతలను కొన్ని అయినా సర్పంచులు, ఇతర నాయకులకు అప్పగించొచ్చని భావిస్తున్నారు. పదవుల్లో ఉన్న నేతల మాటకు అధికారుల వద్ద విలువ ఉంటుందని, అందుకే స్థానిక ఎన్నికలు జరిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై నేతలు ఒత్తిడి పెంచినట్లు చెబుతున్నారు.మరోవైపు బీఆర్ఎస్ కూడా పంచాయతీ ఎన్నికలను స్వాగతిస్తోంది. రెండేళ్లుగా విజయం రుచి కోసం తహతహలాడుతున్న గులాబీ దండు ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. గ్రామస్థాయిలో తమ పట్టు నిరూపించుకుని, కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక పంపాలని ప్రణాళికలు రచిస్తోంది. అటు బీజేపీ కూడా పార్టీ విస్తరణకు పంచాయతీలే పునాదులుగా పావులు కదుపుతోంది. వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేయడం, గెలవడం ద్వారా రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని కమలం నేతలు ప్లాన్ చేస్తున్నారు. ఇలా మూడు పార్టీల వారు ఎన్నికలకు సై అంటుండటంతో గ్రామస్థాయిలో హడావుడి కనిపిస్తోంది.

# బీఆర్ఎస్‌కు నిధుల కొరత.. కారణం ఇదేనట..

**హైదరాబాద్ పెన్ పవర్:**రాజకీయాల్లో ఓటమి అనేది పార్టీలను చాలా వరకు కుంగదీస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మొత్తం పార్టీలోకి నిరాశ, నిస్పృహలు నిండిపోతాయి. దీంతో పాటు ఆర్థిక ప్రవాహం కూడా నిలిచిపోతుంది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితి ఇదే. ఎన్నికలో కూలిపోయేది పార్టీ మాత్రమే కాదు.. దాన్ని నిలబెట్టే అంతర్గత వ్యవస్థలు, కార్యకర్తల నమ్మకం. వరుస ఓటములు, నాయకుల వలసలు, కేసీఆర్ ప్రజల్లో కనిపించకపోవడం ఇవన్నీ కలిసి బీఆర్ఎస్‌ను ఇంతకు ముందెన్నడూ లేనంతగా ఒత్తిడిలోకి నెట్టేశాయి. ఇప్పుడు ప్రధాన చర్చ ఏంటంటే.. పార్టీకి డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి? అసలు వస్తాయా? అన్నదే.

**గతంలో కంటే చాలా వరకు తగ్గిన నిధులు..**

ఇటీవల బీఆర్ఎస్ కు వస్తున్న నిధుల కొరత ఘోరమైన సమాధానం చెప్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్‌కు వచ్చిన డొనేషన్లు మొత్తం రూ.580.52 కోట్లు. కానీ ఈ ఏడాది? ఆశ్చర్యంగా, ఆ మొత్తం నేరుగా రూ.15 కోట్లకు పడిపోయింది. ఇది కేవలం నిధులు తగ్గడమే కాదు.. పార్టీ భవిష్యత్తుపై పెట్టుబడిదారుల నమ్మకం పడిపోవడాన్ని ప్రతిభింబించే సంకేతం. రాజకీయాలకు ఆర్థిక స్థితి ఎంత కీలకమో తెలిసిన వారికి ఇది పెద్ద హెచ్చరిక అనుకోవచ్చు. కార్యకర్తల్లో కూడా ఇదే చర్చ జరుగుతోంది. 'డబ్బు లేక పార్టీ ఎలా నడుస్తుంది?' అన్న ఆందోళన బహిరంగంగా వినిపిస్తోంది.

**వరుస ఓటములతో కష్టాలు..**

వరుసగా జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలవుతుండడం ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ఒకప్పుడు 'అజేయం'గా భావించిన పార్టీ ఇప్పుడు వరుస పరాజయాలతో దెబ్బతింటుంది. ఓటమి రాజకీయాల్లో సహజం. కానీ ఇక్కడ సమస్య సంఖ్య కాదు.. నాయకుల వలసలు, కార్యకర్తల నిరాశ ఇవి బీఆర్ఎస్ ను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఏ పార్టీకి అయినా నిధులు ఎప్పుడు వస్తాయి.. పార్టీ గెలుస్తుంది.. లేదంటే గెలిచే అవకాశం ఉంటుంది.. లేదా ప్రభుత్వంలో ఉండి ఉంటుంది. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా నిధుల ప్రవాహం తగ్గుతుంది..

**ప్రజల్లో కనిపించని కేసీఆర్ ఒక కారణమేనా?**

ఈ నేపథ్యంలో కార్యకర్తల్లో కదులుతున్న మరో ప్రశ్న కేసీఆర్ ప్రజల్లోకి ఎందుకు రావడం లేదు.. పార్టీ నాయకుల మధ్య, ఇంకా రాజకీయ విశ్లేషకుల మధ్య తలెత్తుతున్న ప్రధాన ప్రశ్న ఇదే. ప్రజల్లో కనిపించకపోవడం, కార్యకర్తలకు ఉత్సాహం ఇవ్వకపోవడం, రాష్ట్ర రాజకీయాల్లో యాక్టివ్‌గా లేకపోవడం ఇవి బీఆర్ఎస్‌కు నష్టమే చేశాయి. నాయకత్వం కనిపించకపోతే, ప్రజలు మాత్రమే కాదు, పార్టీ పునాది కూడా ఆందోళనలో పడుతుంది. ఇప్పుడు అదే జరుగుతోంది.

**ఇది ఒకటే సమస్య కాదు..**

కన్న కూతురే పార్టీని వీడి బయటకు రావడం పైగా కేసీఆర్ పార్టీపై విమర్శలు గుప్పించడం, బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందన్న రూమర్లు ఇవి పార్టీ ఇమేజ్‌ను మసకబారుస్తున్నాయి. రూమర్ రాజకీయాల్లో ఎప్పుడూ నిజం కావాల్సిన అవసరం లేదు. కానీ అది చాలు పార్టీపై నమ్మకం తగ్గడానికి. ప్రస్తుతం బీఆర్ఎస్ అదే చీకటిలో కనిపించకుండా పోతోంది.

పార్టీకి నిధులు తగ్గిపోవడం కార్యకలాపాలపై ప్రభావం చూపుతుంది. కార్యాలయ ఖర్చులు, కార్యకర్తల ప్రోత్సాహకాలు, ఎన్నికల ప్రచారాలు ప్రతి స్థాయిలో డబ్బు కీలక ఆయుధం. అది లేకపోవడం అంటే పార్టీ యంత్రాంగం ఆగిపోయినట్లే. ఇప్పుడు బీఆర్ఎస్‌లో జరుగుతున్నదీ అదే. 'ఇంకా కొంతకాలం ఇదే పరిస్థితి ఉంటే పార్టీ పునరుద్ధరణ కష్టమే' అని చాలా మంది కార్యకర్తలు ఆంతర్యంలో మెదులుతుంది. ఇప్పుడున్న పరిస్థితి బీఆర్ఎస్‌కు ఒక పెద్ద ప్రశ్నను తెచ్చిపెడుతుంది. ఈ నిధుల కొరతతో పాటు నాయకత్వ లోపం, వరుస ఓటముల మధ్య పార్టీ మళ్లీ గాడిన పడగలదా?

రాజకీయాల్లో ఎదుగుదల ఒక పరీక్ష అయితే.. క్షీణత అత్యంత పెద్ద పరీక్ష. బీఆర్ఎస్ ప్రస్తుతం ఆ రెండో పరీక్షను ఎదుర్కొంటోంది. ఈ పరీక్షను కేసీఆర్ ఎలా రాస్తారు? కొత్త నాయకత్వం ఎలా ముందుకు వెళ్తుంది? నమ్మకాన్ని తిరిగి ఎలా సాధిస్తారు? ఇవన్నీ రాబోయే నెలల్లో నిర్ణయాత్మకంగా మారబోతున్నాయి. అయితే అంతకుముందు పార్టీ ముందున్న అత్యవసర సమస్య ఒక్కటేనిధులు తిరిగి రావాలి. నమ్మకం తిరిగి రావాలి. అవి లేకపోతే, ఉద్యమ పార్టీగా జన్మించిన బీఆర్ఎస్ తన చివరి దశలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందనే ఆందోళన కూడా పార్టీ అంతర్గత వర్గాల్లో వినిపిస్తోంది.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం

### తాగితే కఠిన చర్యలు తప్పవు

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- గడిచిన సంవత్సర కాలంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 3740 మందిపై కేసులు నమోదు
- రోడ్డు ప్రమాదాల నివారణకే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- మద్యం సేవించి వాహనాలు నడుపుతే జరిమానాలు, జైలు శిక్షలు తప్పవు

**రాజన్న సిరిసిల్ల: పెన్ పవర్:**రాజన్న సిరిసిల్ల జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం,మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరించారు. ప్రజా శాంతి భద్రత,రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రాంతాలపై నిఘా ఉంచడం జరిగిందని.ఇందులో భాగంగా గడిచిన సంవత్సర కాలంలో 3740 మ%శీ%దిపై పెట్టి కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే ప్రదేశాలపై సమాచారం సేకరిస్తున్నామని దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ముఖ్య%శీ%గా రాత్రి సమయాల్లో లైటింగ్ తక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి మరింత సమర్థవంతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని అన్నారు
బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని క్రమం తప్పకుండా గుర్తించడంతో పాటుగా పెట్రో కార్స్,బ్లూ కోల్ట్ పోలీస్ సిబ్బంది బహిరంగ ప్రాంతాలలో మద్యం సేవించే ప్రాంతాల్లో నిఘా కఠినతరం చేయడం జరుగుతుందన్నారు

# మావోయిస్టు పార్టీల్లో అంతర్ యుద్ధం..
# హిడ్మా ఎన్కౌంటరుకు దేవ్ జీ సహకారం?

**హైదరాబాద్ పెన్ పవర్:**అవసాన దశలో ఉన్న మావోయిస్టు పార్టీలో అంతర్ యుద్ధం కూడా పెద్ద ఎత్తున సాగుతోందా? మావోయిస్టు పార్టీ పీఎల్జీఏ ప్లటూన్ కమాండర్, పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మడ్వి హిడ్మా ఎన్కౌంటరుకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్ జీ కారణమన్న ఆరోపణల్లో నిజమెంత? అన్నది ఇప్పుడు అందరిలో ఉత్కంఠ రేపుతోంది. ఎన్కౌంటరులో మరణించిన హిడ్మాపై దేశవ్యాప్తంగా, మరీ ముఖ్యంగా గిరిజన సమాజంలో సానుభూతి వ్యక్తమవుతోందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. హిడ్మా మరణం తర్వాత ఆయన జీవిత చరిత్రపై వివిధ మాధ్యమాల్లో కథనాలు ప్రసారం అవుతున్నాయి. ఇలాంటి సమయంలో హిడ్మా ఎన్కౌంటరుకు మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి తిప్పరి తిరుపతి అలియాస్ దేవుజీ కారణమని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే మనిష్ కుంజం ఆరోపించడం సంచలనంగా మారింది.ఛత్తీస్‌గఢ్‌లోని కొంటా మాజీ ఎమ్మెల్యే అయిన మనిష్ కుంజం బస్తర్ ప్రాంతంలో గిరిజన నాయకుడిగా చలామణి అవుతున్నారు. సీపీఐ (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా) నాయకుడైన మనిష్ కుంజం తాజాగా మీడియాతో మాట్లాడుతూ, హిడ్మా ఎన్కౌంటరు వెనుక దేవుజీ పాత్ర ఉందంటూ సంచలన ఆరోపణలు చేశాడు. లొంగిపోదామని చెప్పి ఆంధ్రా ప్రాంతానికి హిడ్మాను తీసుకెళ్లిన దేవుజీ పోలీసులకు సమాచారమిచ్చి హిడ్మాను చంపించి, మిగిలిన వారిని అరెస్టు చేయించి తాను మాత్రం



తప్పించుకున్నాడని మాజీ ఎమ్మెల్యే మనిష్ కుంజం ఆరోపిస్తున్నారు.నిజానికి హిడ్మా కూడా లొంగిపోవాలని అనుకున్నారని, గిరిజనుల సమక్షంలో తన లొంగుబాటును ప్రకటించాలని ఆయన భావించారని ఛత్తీస్‌గఢ్ మీడియాకు మనిష్ కుంజం వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోవాలని భావించిన హిడ్మా ఆంధ్రాకు ఎందుకు వెళతాడని గిరిజన నాయకులు అనుమానిస్తున్నారు. అందుకే ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తూ న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే గిరిజన నేతల ఆరోపణలను పోలీసులు ఖండిస్తున్నారు. హిడ్మా నిజమైన ఎన్‌కౌంటర్‌లోనే చనిపోయాడని స్పష్టం చేస్తున్నారు. అయితే ఎన్‌కౌంటర్‌పై ఎవరి వాదన ఎలా ఉన్నప్పటికీ, హిడ్మాపై దేవుజీ కుట్ర చేశాడన్న ఆరోపణలే సంచలనంగా మారుతున్నాయి.

మావోయిస్టు పార్టీలో తెలుగు నేతల ఆధిపత్యంపై ఎప్పటి నుంచో విమర్శలు ఉన్నాయని అంటున్నారు. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతానికి చెందిన తెలుగు నేతలు చదువుకున్న వారు కావడంతో మావోయిస్టు పార్టీ నాయకత్వం చేపట్టి, గిరిజన నేతలపై ఆధిపత్యం చెలాయించేవారని ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గిరిజన నాయకులు ఆరోపిస్తున్నారు. నిజానికి ఈ అంశంపై చాలా కాలంగా చర్చ జరుగుతోంది. మావోయిస్టుల్లో ఎక్కువ మంది గిరిజనులే.. క్షేత్రస్థాయిలో ప్రాణాలు పణంగా పెట్టి పోరాడుతున్నారని, కానీ నాయకత్వం అంతా తెలుగువారి చేతుల్లో పెట్టుకున్నారని విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హిడ్మా ఎన్కౌంటరు తర్వాత తెలుగు నేతల పాత్రపై గిరిజన నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. మావోయిస్టుల్లో హిడ్మా ప్రాబల్యం పెరగడం, అతడిని అడ్డు తొలగించుకోడానికి పార్టీ అగ్రనాయకత్వమే కుట్ర చేసిందన్న ఆరోపణలు ఇప్పుడు సంచలనంగా మారాయని అంటున్నారు.

# పదో తరగతి నుండి బీటెక్ వరకు... చదువుకోకుండానే సర్టిఫికెట్లు!

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో నకిలీ విద్యా సర్టిఫికెట్ల రాకెట్ భారీ స్థాయిలో నడుస్తున్న విషయం రంగారెడ్డి జిల్లాలో వెలుగులోకి వచ్చింది. “పదో తరగతి నుండి బీటెక్ వరకు... చదువుకోకుండానే సర్టిఫికెట్లు!” అంటూ యువతను ఉద్దేశించి ప్రచారం చేస్తున్న ఓ ముఠాను సైబరాబాద్ ఎస్ఓటి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. నార్సింగి ప్రాంతంలో నెలకొల్పిన ఓ గుట్టు ఆఫీసులో పోలీసులు దాడి చేయగా.. షాకింగ్ విషయాలు బయటపడ్డాయి. ఆ కార్యాలయంలో ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్ సర్టిఫికెట్లు సహా వివిధ రాష్ట్రాల యూనివర్సిటీల పేర్లతో నకిలీ డాక్యుమెంట్లు తయారు చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ప్రత్యేక ఆపరేషన్‌లో మొత్తం ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు.



**రాకెట్‌కు మాస్టర్‌మైండ్: మీర్జా అక్తర్ అలీ బేగం**

ఈ నకిలీ సర్టిఫికెట్ల రాకెట్‌కు కీలక కారకుడు మీర్జా అక్తర్ అలీ బేగం అని పోలీసులు తెలిపారు. డాక్యుమెంట్ల తయారీ, ప్రింటింగ్, విక్రయం.. మొత్తం కార్యక్రమాన్ని ఇతనే పర్యవేక్షిస్తున్నట్టు విచారణలో తేలింది. ఈ గ్యాంగ్ , సర్టిఫికెట్లు కొనుగోలు చేసే ప్రజల మధ్య దలారి పాత్ర పోషించిన మహమ్మద్ అహ్మద్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ గ్యాంగ్ నుండి నకిలీ సర్టిఫికెట్లు కొనుగోలు చేయడానికి వచ్చిన ముగ్గురు వ్యక్తులు వెంకటసాయి, రోహిత్, ప్రవీణ్ కుమార్ ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. వీరు ఉద్యోగ అవసరాల కోసం ఫేక్ డాక్యుమెంట్లు పొందడానికి ప్రయత్నించినట్టు వెల్లడించారు.

**ధరలు ఎలా ఉండేవి?**

పదో తరగతి సర్టిఫికేట్ కు ?50,000, ఇంటర్మీడియట్ సర్టిఫికేట్ కు ?75,000, డిగ్రీ, బీటెక్ సర్టిఫికెట్లకు ఇంకా ఎక్కువ ధరలు ఉండనున్నాయి. తక్కువ ఎంక్వైరీ జరిగే అవకాశం ఉన్న మిగతా రాష్ట్రాల యూనివర్సిటీ పేర్లను ఎక్కువగా వాడి సర్టిఫికెట్లు తయారు చేస్తున్నట్టు తెలిసింది.

**దర్యాప్తు వేగవంతం: ఎక్కడెక్కడ వినియోగించారు?**

పోలీసులు ఇప్పుడు కొన్ని కీలక అంశాలపై దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ఫేక్ సర్టిఫికెట్లను కొనుగోలు చేసిన వ్యక్తులు ఎంత మంది ఉన్నారు? వారిని ఏ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు? పాస్‌పోర్ట్, వీసాల కోసం లేదా ప్రభుత్వ/ప్రైవేట్ ఉద్యోగాల్లో వీటిని ఉపయోగించారా? అనే కోణంలో లోతుగా విచారణ జరుపుతున్నారు. వాస్తవాలు బయటకు వస్తున్న కొద్దీ ఈ రాకెట్ పరిమాణం మరింత పెరిగే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

**డిజిలాకర్‌తో సులభంగా వెరిఫికేషన్!**

నకిలీ సర్టిఫికెట్ల సమస్యను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం డిజిలాకర్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీల ఒరిజినల్ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండడంతో సంస్థలు వెంటనే వెరిఫికేషన్ చేయవచ్చు. అంతేకాకుండా, మెమోలు, సర్టిఫికెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ల ద్వారా కూడా నకిలీలను చాలా సులభంగా గుర్తించే అవకాశం ఉంది.
యువత ఎవరూ కూడా అడ్డదారిలో సర్టిఫికెట్లను కొనుగోలు చేసి తమ జీవితాలను ప్రమాదంలో పడేయవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఉద్యోగాలు లేదా ఇతర అవసరాల కోసం ఎవరైనా నకిలీ సర్టిఫికెట్లను సమర్పించినట్లు తేలితే, వారికి ఉద్యోగం కోల్పోవడంతో పాటు కఠిన శిక్షలు పడే అవకాశం ఉంది.

# స్థానిక సమరానికి సై.. ఎవరికి అనుకూలం అంటే?




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల పోరుకు వేళయింది. వరసగా పంచాయతి, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి రానుంది. జీహెచ్ఎంసీలో పై చేయి సాధించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఓఆర్ఆర్ ను ఆనుకుని ఉన్న 27 మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేసింది. దీంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి విస్తరించడమే కాకుండా వార్డుల సంఖ్య కూడా పెరగనుంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ కు కేవలం ఒక్కటంటే ఒక్క స్థానం లభించింది. ఈసారి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను హస్తగతం చేసుకునేందుకు అవసరమైన వ్యూహంలో భాగంగానే కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుంది.

**జీహెచ్ఎంసీని హస్తగతం చేసుకునేందుకు...**

ఇక పంచాయతీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునేందుకు వీలుగా కాంగ్రెస్ ఇప్పటికే అనేక వరాలు ప్రకటించింది. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీని ప్రారంభించింది. ప్రధానంగా మహిళల ఓట్లను లక్ష్యంగా చేసుకుని ఈ నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే తీసుకుందని చెప్పాలి. దీంతో పాటు అనేక జిల్లాలకు సంబంధించిన కీలకమైన ప్రాజెక్టులకు కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ఎన్నికల వ్యూహంలో భాగంగానే లోకల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాలు తీసుకుందని అనుకోవచ్చు.

**బీఆర్ఎస్, బీజేపీ కూడా...**

బీఆర్ఎస్ కూడా స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతుంది. ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఆయన వరసగా ఇక నియోజకవర్గాల స్థాయి పర్యటనలు చేపట్టనున్నారు. ఎన్నికల ప్రచారం చేసేందుకు ఇప్పటికే కేటీఆర్ రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకున్నారు.త్వరలోనే ఆయన టూర్ షెడ్యూల్ ను వెలువరించే అవకాశాలున్నాయి. బీజేపీ కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. ఈరోజు బీజేపీ ముఖ్యనేతలతో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సమావేశం నిర్వహించారు. లోకల్ ఎన్నికల్లో అనుసరించాల్సి వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, ప్రచారం వంటి వాటిపై రామచందర్ రావు నేతలతో చర్చించారు. మొత్తం మీద మరో మూడు నుంచి నాలుగు నెలల తెలంగాణలో ఎన్నికల హీట్ ఉండనుంది.

# బీజేపీ, ఎంఐఎం.. భాయీ. భాయీ.. అస్సలు ఊహించలేదు కదా?



**హైదరాబాద్ పెన్ పవర్:**పరస్పర భిన్న ధృవాలుగా ఇన్నాళ్లు రాజకీయాలు చేస్తున్న బీజేపీ, ఎంఐఎం ఒక్కటి కానున్నాయా? బీజేపీవి హిందుత్వ రాజకీయాలు అంటూ దుమ్మెత్తిపోసిన మజ్లిస్ పార్టీ నేత అసదుద్దీన్ ఒవైసీ మాటల్లో మార్పు ఎందుకొచ్చింది? బిహార్ రాజకీయాలు.. భవిష్యత్తులో పెను మార్పులకు సంకేతాలు ఇస్తున్నాయా? అనే చర్చ జరుగుతోంది. బిహార్ లో ఎన్డీఏ ప్రభుత్వానికి షరతులతో కూడిన మద్దతు ఇస్తున్నట్లు మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. మైనార్టీ నేతగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఒవైసీ.. ఇన్నాళ్లు బీజేపీపై ఒంటికాలిపై లేచేవారు. అలాంటిది ఆయన గొంతు సవరించుకుని బీజేపీకి దగ్గరయ్యేలా సంకేతాలివ్వడం రాజకీయంగా ఆసక్తిరేపుతోంది.బిహారులోని అమౌర్ లో జరిగిన ఓ ర్యాలీలో ఒవైసీ ప్రసంగిస్తూ ఎన్డీఏకు షరతులతో మద్దతు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. నిజానికి ఎంఐఎం మద్దతు ఎన్డీఏ ప్రభుత్వానికి అవసరం లేకపోయినా, మజ్లిస్ నేత ఇలా ఓపెన్ గా తన మద్దతు ఉంటుందని ప్రకటించడం కొత్త రాజకీయ సమీకరణలకు తెరలేపుతుందా? అంటున్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు మద్దతు అంటే ఒవైసీ పరోక్షంగా బీజేపీతో చెలిమి కోరుకుంటున్నట్లేనా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీ, మజ్లిస్ చేతులు కలిపితే తెలుగు రాష్ట్రమైన తెలంగాణలో సరికొత్త రాజకీయం ఆవిష్కృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయం టున్నారు.బిహారులో ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉండే ప్రాంతమైన సీమాంచల్ అభివృద్ధి చేయాలని ఒవైసీ డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రాంతంలో 24 అసెంబ్లీ సీట్లు ఉంటే ఎన్డీఏ 14 సీట్లను మాత్రమే గెలుచుకుంది. ఇక్కడ ఎంఐఎం 5 స్థానాల్లో విజయం సాధించి తన పట్టునిలుపుకుంది. ఎప్పుడు వరదలు, వలసలు, అవినీతి వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సీమాంచల్ వాసులను అభివృద్ధి దరికి చేర్చాలని ఒవైసీ కోరుతున్నారు. ఈ కారణంతోనే ఆయన ఎన్డీఏకు మద్దతు ఇచ్చేందుకు ముందుకొస్తున్నట్లు చెబుతు న్నారు.అయితే ముస్లిం మైనార్టీ పార్టీగా గుర్తింపు తెచ్చుకున్న ఎంఐఎం అధినేత ఇలా ఎవరూ ఊహించని విధంగా ఎన్డీఏతో జట్టు కట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించడం రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. ఇప్పటికిప్పుడు ఈ ప్రతిపాదనను బీజేపీ పట్టించుకోకపోయినా, అవసరమైన సమయంలో తనకు అనుకూలంగా మార్చుకునే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా హిందుత్వ ముద్ర వేస్తూ మైనార్టీలను దూరం చేస్తున్న ఎంఐఎం పార్టీనే స్వయంగా మిత్రుత్వానికి దారులు వేస్తుండటం.. తెలంగాణ వంటి రాష్ట్రాల్లో బీజేపీకి అడ్వాంటేజ్ గా మారే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇన్నాళ్లు ఎంఐఎం యాంటీ బీజేపీ రాజకీయాలనే చేసింది. ఇప్పుడు షరతులతో స్నేహం అంటోంది. బీజేపీ నుంచి కూడా సానుకూల స్పందన వస్తే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలతోపాటు తెలంగాణలోని స్థానిక ఎన్నికల్లో ఆ ప్రభావం ఉండొచ్చని అంటున్నారు. నిజానికి ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో ఈ రెండు పార్టీల మధ్య అవగాహన పెరుగుతుందని విశ్లేషించారు. కానీ, ఒవైసీ బిహార్ పర్యటనలో చేసిన వ్యాఖ్యలతో రాజకీయం పూర్తిగా తలకిందులయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయంటున్నారు.